సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 30 । డిసెంబర్ । 2024



అప్పన్నకు ఆర్జిత సేవలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. 8లో



అలల చెంతన అందెల సవ్వడి

అలల చెంత అందెల సవ్వడి విశాఖ వాసులను ఓలలాడించింది. ఎంజీఎం పార్క్ వేదికగా ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. 8లో



వావ్.. నేవీ షో

సాగర జలాల్లో నేవీ సాహసికులు ప్రదర్శించిన పలు విన్యాసాలు సందర్శకులకు కనువిందు చేశాయి. 8లో

న్యూస్‌రీల్

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



లంబసింగి ప్రాంతంలో భారీగా కురుస్తున్న మంచు

చింతపల్లి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. దీంతో చలి తీవ్రత అధికమైంది. ఆదివారం జి.మాడుగులలో 9.3 డిగ్రీలు, అరుకువేలీలో 9.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. మూడు రోజులుగా సాయంత్రం 4 గంటల నుంచి చలి గాలులు వీస్తున్నాయి. పాడేరు డివిజన్ పరిధిలో జీకే వీధిలో 10.4 డిగ్రీలు,చింతపల్లిలో 10.5 డిగ్రీలు,డుంబ్రిగుడలో 10.5 డిగ్రీలు,పాడేరులో 11.0 డిగ్రీలు,హుకుంపేటలో 11.5 డిగ్రీలు,పెదబయలులో 12.1 డిగ్రీలు,అనంతగిరిలో 13.0 డిగ్రీలు,ముంచంగిపుట్టులో 13.1 డిగ్రీలు, కొయ్యూరులో 14.6డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఆశ్రమ పాఠశాల విద్యార్థిని అదృశ్యం



ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆశ్రమోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఉపాధ్యాయుల అనుమతి తీసుకోకుండా ఈనెల 25న పాఠశాల నుంచి బయటకు వెళ్లిపోయింది. కుమార్తెను చూసేందుకు విద్యార్థిని తండ్రి ఈనెల27న పాఠశాలకు రాగా, ఆమె కనిపించలేదు. ఉపాధ్యాయులను అడిగితే రెండు రోజుల నుంచి కనిపించలేదని చెప్పారు. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నారు.

సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలి

విద్యార్థిని అదృశ్యమైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదివారం పాఠశాలను సందర్శించారు. స్థానిక సిబ్బందిని, విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల పర్యవేక్షణ లోపం,ఆశ్రమ పాఠశాలలకు సెక్యూరిటీ సిబ్బంది లేక పోవడం వంటి కారణాల వల్ల విద్యార్థినులకు రక్షణ లేకుండా పోతోందని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని పాఠశాలల వద్ద సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని కోరారు.

రేపు జాబ్ మేళా

మురళీనగర్(విశాఖ): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని కంచరపాలెం ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫీస్‌లో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి శిక్షణ అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో నిపునాఇంజినీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్, హెచ్‌డీబీ ఫైనాన్సియల్ సర్వీసెస్, మెడీప్లస్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఏదైనా డిగ్రీ, డిప్లొమా ఎలక్ట్రికల్ పూర్తిచేసిన నిరుద్యోగ యువకులందరూ హాజరు కావచ్చు. ఎంపికైన అభ్యర్థులు విశాఖ జిల్లాలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9948768778 సంప్రదించాలి.

నేటి నుంచి నేషనల్ సింపోజియం

మురళీనగర్(విశాఖ): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో కెమికల్ అండ్ ఫార్మసీ కంపెనీల్లో ప్రమాదాల నివారణపై నేషనల్ సింపోజియం సోమవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు గైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ఫైర్ సర్వీసెస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కార్మిక శాఖ సంయుక్త సహకారంతో ఈ సింపోజియం నిర్వహిస్తామన్నారు. ఐఐటీ, ఐఐపీ, ఐఐసీహెచ్ఈ, ఏఐసీటీఈ, ఎన్ఐటీ సంస్థల అకడమిషియన్లు, ఫ్యాక్టరీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా కెమికల్ ఇంజినీరింగ్‌లో 34 ఏళ్లు సేవలందించి ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న డాక్టర్ బీవీ లక్ష్మణరావును సత్కరిస్తామన్నారు.

అడవి బిడ్డల గోడు.. పట్టదాయె

గిరిపుత్రుల సమస్యలు పరిష్కరించాల్సిన ఐటీడీఏలు ఆ దిశగా చేపడుతున్న చర్యలు కంటితుడుపుగా ఉన్నాయి. అడవి బిడ్డల గోడు ఎవరికీ పట్టడం లేదు. గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా జిల్లాలో ఏర్పాటైన సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ల్లో పాలకవర్గ సమావేశాలు నిర్వహించకపోవడంతో గిరిజన సంక్షేమం, అభివృద్ధి కుంటుపడుతోంది. ఫలితంగా అధికారుల పాలన ఇష్టారాజ్యంగా జరుగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమస్యలు పరిష్కరించాల్సిన పాలకవర్గం ఉందో లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది. సమావేశాల విషయమై ఎవరైనా ప్రశ్నిస్తే ఇదిగో...అదిగో అంటూ అధికారులు దాటవేస్తున్నారు.

- గిరిపుత్రుల సమస్యలపై అడిగే వారే కరవు
- సమావేశం కాని ఐటీడీఏ పాలకవర్గాలు
- గిరిజనాభివృద్ధి గాడి తప్పుతోందనే విమర్శలు
- ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అనే చందంగా సమస్యలు
- 3 నెలలకోసారి నిర్వహిస్తామన్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

అమలు కాని గిరిజన మంత్రి హామీ

కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత మొదటి సారిగా పాడేరు వచ్చిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి కచ్చితంగా ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి ఆరునెలలైనా ఒక్క పాలకవర్గ సమావేశం నిర్వహించలేదు.

అధికారంలోకి వచ్చి ఆరునెలలైనా జరగని వైనం

> రాజ్యాంగం ఆర్టికల్ 275 ఆధారంగా ఏర్పడిన సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)ల్లో ప్రతి మూడు నెలలకు ఒకసారి పాలకవర్గ సమావేశం జరగాలి. ఐటీడీఏ చైర్మన్ హోదాలో కలెక్టర్ పాలకవర్గ సమావేశాన్ని నిర్వహిస్తారు. పాలకవర్గ సభ్యులుగా ఉండే ప్రజాప్రతినిధులైన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు తమ దృష్టికి వచ్చిన సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువస్తారు. ఆయా సమస్యలపై చర్చ జరగడం, పరిష్కారాలు ప్రస్తావించడం, గిరిజనులకు ఎలా మేలు చేయాలనే అంశాలపై నిర్ణయాలు తీసుకునే కీలకమైన వేదికైన ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలున్నాయి. జిల్లాలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో గిరిజనుల భవిష్యత్తుకు భరోసా కల్పించే ఐటీడీఏల్లో పాలకవర్గ సమావేశాలు జరగకపోవడం గమనార్హం.



పోలవరం నిర్వాసితుల కాలనీ

రంపచోడవరం: రంపచోడవరం ఐటీడీఏ ఏర్పాటు చేసి 50 ఏళ్ల అయింది. ఇంకా మౌలిక వసతులు, గిరిజనుల అభివృద్ధిదిశగా సరైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పాలకవర్గ సమావేశాన్ని ఏళ్ల తరబడి నిర్వహించడంలేదు. అధికారులను ప్రశ్నిస్తున్నా పట్టించుకోవడం లేదు. తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పోలవరం నిర్వాసితులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక గిరిజన యువత ఉసూరుమంటోంది. ఆర్వోఎఫ్ఆర్ పట్టాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఇలాంటి తరుణంలో పాలకవర్గం సమావేశం ఏర్పాటు చేసి, సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

దృష్టిసారించాల్సిన సమస్యలు

రంపచోడవరంలో గతంలో రెండు సార్లు పాలకవర్గ సమావేశం నిర్వహించేందుకు తేదీలు ఖరారు చేసినా వాయిదా వేశారు. గత అక్టోబర్ నెలలో సమావేశం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. అదికూడా జరగలేదు.

- గతంలో రంపచోడవరం, చింతూరు ఐటీడీఏలకు కలిపి రంపచోడవరంలోనే పాలకవర్గ సమావేశం నిర్వహించారు.
- గిరిజన గ్రామాల్లో కోట్లాది రూపాయల వ్యయంతో అమలు చేసిన పథకాల తీరుతెన్నులు, అమలులో లోపాలు వంటివాటిపై చర్చించడం ద్వారా క్షేత్రస్థాయిలో పథకాల అమలు తీరును పర్యవేక్షణ చేసేందుకు అవకాశం ఉంటుంది.
- సబ్ ప్లాన్ ఏరియా గిరిజనులు ఎప్పటి నుంచో తమ సమస్యలు చెప్పుకొనేందుకు తమ ప్రాంతంలో ఒక అధికారిని నియమించాలని కోరుతున్నారు.దీనిపై ఇప్పటికి ఐటీడీఏ స్పష్టమైన చర్యలు తీసుకోలేదు. వారి సమస్యలు చెప్పుకోవాలంటే కనీసం 200 కిలోమీటర్ల దూరం నుంచి రంపచోడవరం రావాల్సి ఉంది.
- వై.రామవరం అప్పర్ పార్ట్‌లోని ఐదు పంచాయతీల గిరిజనులు తమకు ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలని కోరుతూ గతంలో ఆందోళన చేశారు. ప్రస్తుత కలెక్టర్ మారేడుమిల్లిలో సమావేశం నిర్వహించి ప్రజాభిప్రాయం సేకరించారు. అయినా మండలం ఏర్పాటుపై ఎటువంటి నిర్ణయం తీసుకులేదు.
- ఐదు పంచాయతీల గిరిజనులు తమ మండల కేంద్రానికి వెళ్లేందుకు మూడు మండలాలను దాటి ప్రయాణించి వై.రామవరం చేరుకోవాల్సి వస్తోంది. ఇటువంటి సమస్యలకు పాలకవర్గ సమావేశాల్లోవిధాన పరమైన నిర్ణయాలు తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం ద్వారా పరిష్కార మార్గాలు చూపే అవకాశం ఉంది.

పోలవరం నిర్వాసితులదే అతి పెద్ద సమస్య

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా పలు గిరిజన గ్రామాలు ముంపునకు గురయ్యాయి. వారికి అనేక చోట్ల పునరావాసం కల్పించారు. అక్కడ వరకు బాగానే ఉన్నా కాలనీల్లో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోతోంది. పోలవరానికి భూములిచ్చిన నిర్వాసితులకు పరిహారంగా భూమి ఇవ్వలేదు. కొందరికి భూములిచ్చినా హక్కు పత్రాలు మంజూరు చేయలేదు. ఇంకా కొన్ని గ్రామాల్లో గిరిజనుల పోడు భూములకు నష్టపరిహారం చెల్లించలేదు. గిరిజనుల ప్రయోజనాలు కోసం పనిచేసే ఐటీడీఏ యంత్రాంగం నిర్వాసితుల సమస్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలి. ఇటువంటి సమస్యలకు పాలకవర్గంలో చర్చ జరిపి గిరిజనులకు న్యాయం చేయాలి.

- చాలా మంది గిరిజనులు కొండపోడు పట్టాల కోసం దరఖాస్తులు చేస్తున్నా పట్టించుకునే నాథుడేలేడు.
- రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం గిరిజన యువత తమ పేర్లను నమోదు చేసుకుంటున్నా, వారికి సరైన అవకాశాలు లభించడం లేదు.
- అటవీశాఖ అభ్యంతరాలతో పలు రహదారుల నిర్మాణాలు నిలిచిపోయాయి. ఫారెస్ట్, రెవెన్యూ, ఇంజినీరింగ్ శాఖల అధికారుల సమన్వయంతో వాటిని పరిష్కరించే అవకాశం ఉంది. అయినా సమావేశాలు జరగకపోవడంతో వాటిపై ప్రశ్నించే అవకాశం ప్రజాప్రతినిధులకు లభించడం లేదు.

ఆవిర్భవించి అర్ధ శతాబ్దం...

పాడేరు : నిత్యం సమస్యలతో సహా జీవనం చేస్తున్న గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా, వారి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు 1975 సంవత్సరంలో ఏర్పడిన పాడేరు ఐటీడీఏ లక్ష్యాలను అందుకోలేకపోతోంది. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాలు 243 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సుమారు 6లక్షలకు పైగా జనాభా ఉన్నారు. జనాభాలో 90శాతానికి పైగా గిరిజనులే. వీరి సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాల్సిన ఐటీడీఏ గాడి తప్పుతోంది. పాలకవర్గ సమావేశాల ఊసే లేకుండా పోయింది.

సమస్యలు పట్టించుకునే నాథుడేడి

పాడేరు ఐటీడీఏ పరిధిలో ప్రధాన సమస్యలైన తాగునీరు, రహదారులు, ప్రాథమిక వైద్యం, గిరిజన గ్రామాల్లో సౌకర్యాల కల్పన తదితర వాటిని పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. ఐటీడీఏ పాలన గాడి తప్పిందని, తక్షణమే ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గిరిజనులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, పలు రాజకీయ పార్టీల నాయకులు కోరుతున్నారు.

ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహించాలి



గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, పరిష్కారమార్గాన్ని చూపేందుకు ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహించాలి. గిరిజనుల కోసం ఐటీడీఏ చేస్తున్న కార్యక్రమాలు ఏమిటనేది ఇప్పటికి చాలామందికి తెలియదు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, గిరిజన సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. మూడు నెలలకు ఒకసారి ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహిస్తామని మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఇచ్చిన హామీ నేరవేర్చలేదు. కలెక్టర్ స్పందించి పాలకవర్గ సమావేశ నిర్వహణ కోసం చర్యలు తీసుకోవాలి.

– మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు



ఐటీడీఏ : రంపచోడవరం
మండలాలు : రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి, గంగవరం, వై.రామవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి
జనాభా : 2,18,385



ఐటీడీఏ : పాడేరు
మండలాలు: పాడేరు, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు, జి.మాడుగుల, అరకులోయ, డుంబ్రిగుడ, పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట, అనంతగిరి
జనాభా: సుమారు 6లక్షలు



ఐటీడీఏ : చింతూరు
మండలాలు : చింతూరు, ఎటపాక, కూనవరం, వీఆర్ పురం
జనాభా : 1,35,082 మంది

పాలకవర్గ సమావేశంతో గిరిజనులకు మేలు



ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలు నిబంధనల ప్రకారం నిర్వహించాలి. సమావేశాల ద్వారా అనేక సమస్యలను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లే అవకాశం ఉంటుంది. అధికారుల తీరు ప్రశ్నించే అవకాశం, సమస్యలపై చర్చించి సరైన పరిష్కారమార్గం చూపే వీలుంటుంది. గిరిజనులకు మేలు జరుగుతుంది.

– పల్లాల కృష్ణారెడ్డి, ఎంపీపీ గంగవరం

న్యూఇయర్ వేడుకల్లో నిబంధనలు పాటించాలి

డీఎస్పీ ప్రమోద్

పాడేరు : శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సరం వేడుకలను నిర్వహించుకోవాలని, నిబంధనలు పాటించకుండా సమస్యలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పాడేరు డీఎస్పీ ప్రమోద్ స్పష్టం చేశారు. స్థానిక జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో పాడేరు పట్టణంతో పాటు పర్యాటక ప్రాంతమైన వంజంగిలో ఉన్న హోటళ్లు, రిసార్టుల నిర్వాహకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హోటళ్లు, రిసార్టుల వద్ద నూతన సంవత్సర వేడుకలు నిర్వహించే వారు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. లాడ్జీలు, రిసార్టులు, హోటళ్ల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎక్కువ శబ్దం వచ్చే సౌండ్ సిస్టంకు అనుమతి లేదని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం అమ్మకాలు, సేవించడం చేస్తే, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాడేరు సీఐ దీనబంధు పాల్గొన్నారు.



హోటళ్ల యజమానులతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రమోద్

సన్‌డే సందడి

పర్యాటక ప్రాంతాలకు టూరిస్టుల తాకిడి



చాపరాయి వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

డుంబ్రిగుడ: జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాల వద్ద టూరిస్టులు సందడి చేశారు.ఆదివారం సెలవు కావడంతో కుటుంబ సమేతంగా వచ్చి ఎంజాయ్ చేశారు. డుంబ్రిగుడ మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయితో పాటు అంజోడ సిల్క్ ఫారం, అరకు పైనరీకి పర్యాటకులు పోటెత్తారు. అరకు పైనరీకి శని, ఆదివారాల్లో ప్రవేశ రుసుం ద్వారా సుమారు రూ.1.55 లక్షలు, చాపరాయిని సందర్శించిన వారి ద్వారా రూ. 3.43లక్షల ఆదాయం లభించినట్టు నిర్వాహకులు తెలిపారు.

లంబసింగికి పర్యాటకుల తాకిడి

చింతపల్లి: మండలంలోని లంబసింగిని ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది. అల్పపీడన ప్రభావంతో ఇటీవల కొంత చలి తీవ్రత తగ్గినప్పటికీ రెండు రోజులుగా మంచు కురుస్తోంది. ఆదివారం తెల్లవారుజాము నుంచే కుటుంబాలతో లంబసింగి చేరుకుని మంచు అందాలను ఆస్వాదించారు. లంబసింగితో పాటు చెరువులవేనం వ్యూపాయింట్, తాజంగి జలాశయాన్ని సందర్శించారు.



చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద..



చాపరాయి వద్ద వనభోజనాలు చేస్తున్న సందర్శకులు



అరకు పైనరీలో వృక్షాల అందాలు తిలకిస్తున్న టూరిస్టులు

108లో ఒకే రోజు రెండు కాన్పులు

రాజవొమ్మంగి: 108 వాహనం... మారుమూల ప్రాంతాల్లో నివసించే గర్భిణుల పాలిట అపద్బాంధవిగా మరోసారి రుజువైంది. ఒకే రోజు 108 వాహన సిబ్బంది ఇద్దరు మహిళలకు మార్గమధ్యంలో ప్రసవం జరిపారు. మండలంలోని వాతంగి సచివాలయం పరిధిలోని ఇరువురు గర్భిణులకు శనివారం రాత్రి పురిటినొప్పులు వచ్చాయి. వారిని 108 సిబ్బంది జడ్డంగి పీహెచ్‌సీకి తీసుకువెళుతుండగా పురిటి నొప్పులు అధికం కావడంతో మార్గమధ్యంలో ప్రసవించారు.అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని జడ్డంగి పీహెచ్‌సీకి తరలించారు. తల్లులు, పిల్లలు క్షేమంగా ఉన్నట్టు డాక్టర్ యామిని ప్రియదర్శిని తెలిపారు. వాతంగి గ్రామానికి చెందిన బల్లుల చిన్నారిని శనివారం రాత్రి 9 గంటలకు, ఓగిపాలెం గ్రామానికి చెందిన గోము మీనాక్షిని అర్ధరాత్రి 12 గంటలకు 108లో జడ్డంగి పీహెచ్‌సీకు తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రసవించారు. 108 సిబ్బంది చిట్టిబాబు, పైలెట్ మణిరాజులు ఏఎన్ఎం, ఆశల సహాయ సహకారాలతో ప్రసవం జరిపారు.





ఒకే రోజు 108 వాహనంలో పండంటి బిడ్డలకు జన్మనిచ్చిన గిరిజన మహిళలు చిన్నారి, మీనాక్షి

అంబులెన్స్ ఎక్కిస్తుండగా : దాకరాయి శివారు ఆదివాసీలునివశించే తండాలో ఆదివారం కొర్రా కొత్తెకు పురిటినొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. ఆమెను వాహనం ఎక్కించేలోగానే పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను 108 సిబ్బంది రాజవొమ్మంగి పీహెచ్‌సీకు తరలించారు. సకాలంలో 108 వాహనం రావడంతో తల్లీ బిడ్డలు ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డారని గ్రామస్తులు తెలిపారు.

నేటితో ముగియనున్న మార్గశిర మాసోత్సవాలు

డాబాగార్డెన్స్(విశాఖ): మార్గశిర మాసోత్సవాల 28వ రోజు ఆదివారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. పంచామృతాభిషేక సేవలో 8 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి. ముగింపు సందర్భంగా ఉదయం మాల విరమణ మాతలతో శాంతి హోమం, సాయంత్రం 6.30 గంటలకు సహస్రదీపాలంకరణ నిర్వహించనున్నారు.



అలంకరణలో అమ్మవారు

స్టీల్‌ప్లాంట్‌పై స్పష్టమైన ప్రకటన చేయాలి

- లేకపోతే ప్రధాని విశాఖ పర్యటనను అడ్డుకుంటాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పెందుర్తి: స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తామని..సొంత గనులు కేటాయించి ప్రభుత్వ ఆధీనంలోనే నడుపుతామని ప్రధాని మోదీతో ప్రకటన చేయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆ తరువాతే ప్రధాని విశాఖలో పర్యటించాలన్నారు. అలా చేయకపోతే విశాఖ ప్రజలంతా ఏకమై ప్రధాని పర్యటనను అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పెందుర్తి సమీపంలోని సుజాతనగర్‌లో ఓ కల్యాణమండపంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. గతంలో అనేక సందర్భాల్లో విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధాని విశాఖ ఉక్కుపై ఎలాంటి ప్రకటన చేయకుండా తప్పించుకున్నారని ఆరోపించారు. ఓ వైపు బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు ప్లాంట్ ప్రవేటీకరణ జరగదని ప్రజలను మభ్యపెడుతుంటే..కేంద్ర ప్రభుత్వం చాపకింద నీరులా ప్రవేటీకరణ పనులు చక్కబెట్టుకుపోతోందని ఆరోపించారు. ప్రజలను మభ్యపెట్టేందుకు కూటమి పెద్దలు ఇలాంటి తప్పుడు ప్రకటనలు చేయడం తగదన్నారు. మిట్టల్ కంపెనీ కోసం స్టీల్‌ప్లాంట్‌ను బలిచేయడం తగదన్నారు. విశాఖ ఉక్కుపై ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయకపోతే ప్రజలతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో ఆయన పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. రుషికొండపై గత ప్రభుత్వం నిర్మించిన భవనాన్ని సైన్స్ మ్యూజియంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సింహాచలం దేవస్థానం భూ సమస్యను ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. నిరుపేదలకు స్థలాలు, ఇళ్లు ఇవ్వకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ప్రభుత్వం కొమ్ము కాస్తోందని ఆరోపించారు. నిరుపేద జీవితాలతో ప్రభుత్వాలు ఆడుకుంటే తాము ఊరుకోబోమని... ప్రజల తరఫున సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావ్, బి.జగన్, జిల్లా కమిటీ సభ్యులు బి.రమణి, బి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం!

- స్నేహితుడిని కలిసేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం
- మరో విద్యార్థికి తీవ్ర గాయాలు



దువ్వి సాకేత్ మృ దువ్వి సాకేత్(ఫైల్)


గాయాలపాలైన సాయి మహర్షి(ఫైల్)

కొమ్మాది/అక్కిరెడ్డిపాలెం: స్నేహితుడిని కలిసేందుకు వెళ్తూ బీచ్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బీబీఏ విద్యార్థి మృతి చెందాడు. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి ఆరిలోవ ఎస్‌ఐ రామదాసు తెలిపిన వివరాలివీ.. చిన అక్కిరెడ్డిపాలెంలో రియల్ ఎస్టేట్ సంస్థలో పని చేస్తున్న దువ్వి వెంకటేష్ పెద్ద కుమారుడు దువ్వి సాకేత్(18) ఎంవీపీకాలనీలోని ఓ కళాశాలలో బీబీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. అక్కిరెడ్డిపాలెంలోని నూకాలమ్మ ప్రాంతానికి చెందిన తలారి సాయి మహర్షి అనకాపల్లిలో రెండో సంవత్సరం డిప్లమో అభ్యసిస్తున్నాడు. ఇద్దరూ కలిసి ఆదివారం ఉదయం 6 గంటలకు ఎండాడలో ఉన్న స్నేహితుడిని కలిసేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. సాగర్ నగర్ వద్ద ప్రభుత్వ అంధబాలికల పాఠశాలకు ముందు మలుపు తిరుగుతుండగా.. అతి వేగం కారణంగా ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనున్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న సాకేత్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న సాయి మహర్షికి తలకు తీవ్ర గాయాలు కావడంతో రుషికొండలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో.. వారు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామదాసు తెలిపారు. అతివేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనతో చినఅక్కిరెడ్డిపాలెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సాకేత్ కుటుంబం వాల్తేర్ నుంచి వచ్చి చిన అక్కిరెడ్డిపాలెంలో స్థిరపడింది.





అలల చెంతన అందెల సవ్వడి

- కనులపండువగా బ్రహ్మాంజలి
- శాస్త్రీయ నృత్య ఘోషతో సాగరతీరం పులకింత

ఏయూక్యాంపస్: అలల చెంతన అందెల సవ్వడి విశాఖ వాసులను ఓలలాడించింది. బీచ్‌రోడ్డులోని ఎంజీఎం పార్క్ వేదికగా ఇంటర్నేషనల్ ట్రెడిషనల్ డ్యాన్స్ కాంగ్రెస్–2024లో భాగంగా చివరి రోజు ఆదివారం 1,500 మందికి పైగా కూచిపూడి కళాకారులతో బ్రహ్మాంజలి–మహాబృంద నృత్యం చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన కళాకారులు ఒకే వేదికపై పాదం కలిపారు. కూచిపూడిని నాటి నుంచి నేటి వరకు విశ్వవ్యాప్తం చేసిన గురువులందరినీ స్మరించుకుంటూ ఈ నృత్య నివేదన చేశారు. ఈ సందర్భంగా సిద్ధేంద్ర కళాక్షేత్రం పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి మాట్లాడుతూ విశాఖ, కాకినాడ, కూచిపూడి, గుంటూరులలో ఇటువంటి బృహత్ కార్యక్రమాలు జరగడం సంతోషం కలిగిస్తోందన్నారు. ఇది జ్ఞాన అధ్యయనానికి ఉపకరించే కళ అని అన్నారు. బాలురు కూడా కూచిపూడి నృత్యాన్ని అభ్యసించాలని సూచించారు. సంస్కారవంతమైన మార్గంలో చిన్నారులను నడిపించాలని తల్లిదండ్రులను కోరారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ కళాకృష్ణ మాట్లాడుతూ కూచిపూడి నృత్యం నేడు విశ్వవ్యాప్తం అయిందన్నారు. కళలు సంస్కృతిని చాటుతాయన్నారు. కూచిపూడి నృత్య గురువు పి.సుధీర్ రావు మాట్లాడుతూ చిన్నారులను కళల దిశగా నడిపించే బాధ్యత తల్లితండ్రులదేనన్నారు. మంచి గురువును ఎంపిక చేసుకుని శ్రద్ధతో నేర్చుకోవాలన్నారు. కళారత్న కె.వి.సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ నగరంలో నిర్వహిస్తున్న మూడు రోజుల వేడుక భారతీయ నృత్య, సాంస్కృతిక వైభవాన్ని చాటిందన్నారు. రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ విశాఖ నగరం ఎంతో పుణ్యం చేసుకుందన్నారు. ఇటువంటి మహోన్నత కార్యక్రమానికి విశాఖ సాగర తీరం వేదికయ్యిందన్నారు. కార్యక్రమ సంచాలకుడు బత్తిన విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన సందీప్ బృందం పేరిణి నృత్యం, కళాకృతి బృందం కావడి నృత్యం, కళాకృతి బృందం కరగాట్టం నృత్యం, కోల్‌కతాకు చెందిన అనురేఖా బృందం కథక్ నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఒడిశా, ఢిల్లీకి చెందిన కళాకారులు పలు నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో విభిన్న ప్రాంతాల నుంచి హాజరైన నాట్య గురువులను వేదికపై సత్కరించి, పురస్కారాలు ప్రదానం చేశారు.

ఆంగ్ల బోధనలో మెలకువలపై శిక్షణ

- 40 రోజుల ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులు
- జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహణ


ఆంగ్ల శిక్షకుడు రామేశ్వర్‌గౌడ్, ఎస్‌ఎస్‌ఏ ఏఎంవో జి.లక్ష్మిలతో ఉపాధ్యాయులు

కంచరపాలెం: జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆంగ్ల భాష నైపుణ్యాలు, ఆంగ్ల మాధ్యమ బోధనలో మెలకువలపై ఆదివారం శిక్షణ నిర్వహించారు. జ్ఞానాపురం జూబ్లీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన ఈ శిక్షణకు జిల్లాకు చెందిన వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు సుమారు 300 మంది పాల్గొన్నారు. విల్ టు కెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిస్ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సును ఎస్‌ఎస్‌ఏ అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి(ఏఎంవో) జి.లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామేశ్వర్‌గౌడ్ ద్వారా 40 రోజుల ఉచిత ఆన్‌లైన్ స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు ఆంగ్ల మాధ్యమ బోధన మరింత సులభంగా చేసేలా ఈ శిక్షణ దోహదపడనుందన్నారు. ఈ శిక్షణ ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి మాతృభాష తెలుగు మాట్లాడినట్లే.. ఇంగ్లిష్ కూడా మాట్లాడేలా టీచర్లు తమ వంతు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు శ్రద్ధగా తరగతులకు హాజరు కావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. సంస్థ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలోని 33 జిల్లాల్లో 53 వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఏపీలో కూడా తొలిసారిగా విశాఖ జిల్లా విద్యాశాఖ సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామేశ్వర్ గౌడ్‌ను విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సత్కరించారు.

ఆగి ఉన్న బైక్‌ను ఢీకొన్న కారు


ప్రమాదంలో కారు, బైక్


ఘటన స్థలంలో గాయపడిన లాలందాస్

హుకుంపేట: ఆగి ఉన్న బైక్‌ను ఓ కారు ఢీకొన్న ప్రమాదంలో ఓవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మండలంలోని జాతీయ రహదారిలో కూలిపని చేస్తున్న బిహార్‌కు చెందిన లాలందాస్ అనే వ్యక్తి నిత్యావసర సరకులనిమిత్తం వచ్చి మండల కేంద్రం హుకుంపేట సెంటర్‌లో రోడ్డుపక్కన బైక్ ఆపి, నిల్చున్నాడు. ఆ సమయంలో పాడేరు నుంచి అరకు ప్రాంతం వైపు వెళ్తున్న కారు అతి వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో బైక్ నుజ్జు కావడంతో పాటు లాలందాస్ కుడికాలు విరిగిపోయింది. స్థానికులు హుటా హుటిన ప్రైవేటు వాహనంపై పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక ఎస్‌ఐ సురేష్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రైల్వే బ్రిడ్జి సమీపంలో కారు బోల్తా

- ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడిన ఇద్దరు పర్యాటకులు


పానిరంగిని రైల్వే బ్రిడ్జి సమీపంలోని హైవే జంక్షన్ వద్ద బోల్తాపడిన కారు

అరకులోయటౌన్: మండలంలోని పానిరంగిని రైల్వే బ్రిడ్జి సమీపంలోని హైవే జంక్షన్ వద్ద శనివారం అర్ధరాత్రి ఓ కారు బోల్తాపడింది. విశాఖపట్నం వైపు నుంచి అరకులోయకు వస్తున్న పర్యాటకుల కారు అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న విశాఖపట్నం అల్లిపురానికి చెందిన ఇద్దరు స్వల్పగాయాలతో క్షేమంగా బయట పడ్డారు. ప్రమాదానికి గురైన వారిని 108లో అరకు ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఈ హైవేజంక్షన్ నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు మీదుగా అరకులోయకు వెళ్లే రహదారి పూర్తి చేయకపోవడంతో గత నెల రోజుల్లో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. హైవే రహదారి కాంట్రాక్టర్ స్పందించి ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి హైవేకు అప్రోచ్ రోడ్డు ను త్వరితగతిన నిర్మించాలని స్థానికులతోపాటు పర్యాటకులు కోరుతున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం అనంతరం 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ ఏఈవో ఆనంద్ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జాతీయ పోటీలకు నలుగురు ఎంపిక


రాణిస్తున్న కయాకర్‌లు

విశాఖ స్పోర్ట్స్: జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు రాష్ట్రం తరఫున నలుగురు కయాకర్‌లు ఎంపికయ్యారు. పురుషుల కానో స్లాలొమ్‌లో కాంస్యం సాధించిన ఎన్. రాజేష్‌తో పాటు ఎన్.గాయత్రి, డి.చేతన భగవతి, కె.విష్ణు ఎంపికైన వారిలో ఉన్నారు. ఉత్తరాఖండ్‌లోని శివపురి, రిషికేష్‌లలో జరిగిన ఆల్‌ఇండియా కానో స్లాలొమ్ చాంపియన్‌షిప్, కయాక్ క్రాస్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో వీరు పాల్గొన్నట్లు రాష్ట్ర కనోయింగ్, కయాకింగ్ సంఘం అధ్యక్షుడు బలరామ్ నాయుడు తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ప్రోత్సాహంతో వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధిలో భాగంగా వీరంతా 38వ జాతీయ క్రీడల్లో పాల్గొంటారని ఆయన వెల్లడించారు.

24 గంటలూ అత్యవసర సేవలు


మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్‌లో 24 గంటలూ అత్యవసర సేవలు అందిస్తున్నామని సూపరింటిండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. ఆదివారం కేజీహెచ్ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కార్డియాలజీ, యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, పీడియాట్రిక్స్‌లతో పాటు క్యాన్సర్ చికిత్సల వంటి మరెన్నో సూపర్ స్పెషాలిటీ సేవలు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆస్పత్రిలో అన్ని సేవలు ఉచితంగా అందజేస్తున్నామని, ఎవరైనా డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయడానికి కమాండ్ కంట్రోల్ రూమ్(0891-2590100, 0891-2590102) ఏర్పాటు చేశామన్నారు. క్యాన్సర్ రోగుల కోసం రూ.16 కోట్లతో అత్యధిక లినాక్ మిషన్ త్వరలో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. క్యాన్సర్ నిర్ధారణ కోసం సీఎస్‌ఆర్ బ్లాక్ మొదటి అంతస్తులో ఓపీ 222 ఏర్పాటు చేశామని, వారానికి రెండు రోజులు ఓపీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆస్పత్రిలో 190 సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయని, మరో 100 కెమెరాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. కేజీహెచ్ ప్రధాన గేటు వద్ద 50 పడకల సామర్థ్యంతో కొత్త క్యాజువాలిటీ విభాగం ఏర్పాటు చేస్తున్నామని, రూ.35 కోట్లతో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సీఎస్‌ఆర్ నిధులతో నిర్మాణం జరుగుతుందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ న్యూఢిల్లీ సహకారంతో సికిల్ సెల్ వ్యాధికి జన్యుపరీక్షలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని, ఆ వ్యాధి నిర్ధారణ కోసం రూ. 6.30 కోట్లు కేంద్రం మంజూరు చేసిందన్నారు. కేజీహెచ్‌లో వాస్కులర్ సర్జరీ విభాగం ఏర్పాటైందని, వారానికి మూడు రోజులు వైద్యనిపుణులు అందుబాటులో ఉంటారని సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ తెలిపారు. సమావేశంలో సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ మోహర్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వావ్.. నేవీ షో





తీరానికి చేరుతున్న కమాండోలు


హెలికాప్టర్ల విన్యాసాలు


దాడి చేసి బందీలను విడిపించడం వంటి సన్నివేశాలు


విద్యుత్ వెలుగుల్లో నౌకలు

నేవీ విన్యాసాలు అబ్బురపరిచాయి. వీకెండ్ కావడంతో ఆదివారం పర్యాటకులు భారీగా తరలిరాగా..విన్యాసాలు వీక్షించి మధురానుభూతి పొందారు. సాగరతీరం యుద్ధవాతావరణాన్ని తలపించింది. నేవీ విన్యాసాల రిహార్సల్ ఆద్యంతం ఆకట్టుకున్నాయి. నౌకాదళ విన్యాసాలలో సాగర తీరం సంభ్రమాశ్చర్యాలకు కేంద్రంగా మారింది. నేవీ సాహసికులు ప్రదర్శించిన పలు విన్యాసాలు సందర్శకులకు కనువిందు చేశాయి. ప్రతి విన్యాసం అబ్బురపరిచింది. నింగి, నేలా తేడాలేదనేలా సాగిన ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకించిన ప్రజలు సరికొత్త అనుభూతిని పొందారు. యుద్ధ ట్యాంకర్లతో శత్రుసేనపై విరుచుకుపడిన విన్యాసాలు ఆకర్షణగా నిలిచాయి. గగన తలంపై భారత జాతీయ పతాకం, నావికాదళ పతాకాలను ఎగరేస్తూ హెలికాప్టర్ల ఆగమనంతో కార్యక్రమం ప్రారంభమైంది. సముద్రంలోనుంచి తీరానికి చేరుకోవడం, హెలికాప్టర్ల నుంచి సముద్రంలోనికి తాడు సాయంతో దిగడం, శత్రువులపై దాడి చేసి బందీలను విడిపించడం వంటి సన్నివేశాలు అబ్బురపరిచాయి. క్రమపద్ధతిలో చేతక్ హెలికాప్టర్లు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలీకాప్టర్లు, హాక్స్ విమానాలు, డార్నియర్ హెలికాప్టర్, సీటింగ్ హెలికాప్టర్, యుద్ధవిమానాలు వ్యూహాత్మకంగా చేసిన విన్యాసాలు అందరి దృష్టిని ఆకట్టుకున్నాయి. నౌకలపై ప్రత్యేకమైన మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీప కాంతులు చిన్నారులను మైమరపింపజేశాయి. నావికాదళంలో పనిచేసే సిబ్బంది జీవనాన్ని, విధులను వివరించే విధంగా సీ క్యాడెట్ కార్ప్స్ సంగీతానికి అనుగుణంగా నర్తించిన విధానం ఆహూతులను అలరించింది.


– ఏయూక్యాంపస్,
ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కిమ్స్ ఆస్పత్రికి నోటీసులు

సీతమ్మధార: కిమ్స్(ఎన్‌ఆర్‌ఐ) ఆసుపత్రికి వీఎంఆర్డీఏ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. సీతమ్మధారలోని బీఎస్ లేఅవుట్‌లో ఉన్న ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రిని మూడు నెలల కిందట కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి యాజమాన్యం టేకోవర్ చేసింది. ఆసుపత్రి నిర్మాణానికి గానూ అప్పటి వుడా (వీఎంఆర్‌డీఏ) ఎన్‌ఆర్‌ఐ యాజమాన్యానికి గజం రూ.270 చొప్పున భూమిని కేటాయించింది. అప్పటి ఒప్పందం ప్రకారం ఆసుపత్రిలో 10 నుంచి 20 శాతం మంది రోగులకు ఉచిత వైద్యం అందించాలి. ఆసుపత్రిలో 300 పడకలు ఉన్నందున, దాదాపు 60 పడకలను ఉచిత వైద్యానికి కేటాయించాల్సి ఉంది. ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్‌కు ఇటీవల లేఖ రాశారు. ఈ నేపథ్యంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఆసుపత్రికి నోటీసులు జారీ చేస్తూ, ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు


ఎంపికైన జట్లు

గాజువాక: కర్నూలులో వచ్చే నెల 4, 5, 6 తేదీల్లో నిర్వహించనున్న ఎం.రంగారావు మెమోరియల్ 50వ అంతర్ జిల్లాల బాలబాలికల కబడ్డీ పోటీలకు విశాఖ జిల్లా జట్లను ఆదివారం ఎంపిక చేశారు. గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు బాలుర జట్టులో స్థానం కోసం 80 మంది క్రీడాకారులు, బాలికల జట్టులో స్థానం కోసం 60 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. వీరిలో నుంచి 20 మంది బాలురును, 20 మంది బాలికలను ప్రాథమికంగా ఎంపిక చేశారు. వీరికి గాజువాక ఉన్నత పాఠశాలలో శిక్షణ నిర్వహించిన అనంతరం ఒక్కో జట్టుకు 12 మంది చొప్పున తుది ఎంపిక చేస్తామని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నిర్వాహక కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ రిఫరీ బోర్డు చైర్మన్ పి.అప్పారావు, సీనియర్ కోచ్ ఉమా శంకర్ బాబు, సీనియర్ క్రీడాకారులు వి.బాబూరావు, పి.వి.రమణ, వి.పైడిరాజు, పి.బాబూరావు, ఎన్.మంగరాజు, వి.నిరుపమ తదితరులు పాల్గొన్నారు.